క్లుప్తంగా

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం అర్బన్ సీఐ చాంద్‌బాషా రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏవైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, డబ్బుల విషయమై బెదిరించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గొడవలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ

సింహాద్రిపురం : మండలంలోని లోమడలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఎంపీడీఓ కృష్ణమూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రూ.307లు కనీస వేతనం తక్కువ కాకుండా కొలతల మేర పనులు చేపట్టాలన్నారు. అలాగే గ్రామంలోని అందరికీ పని చూపాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ జయభారతి, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు. అలాగే మండలంలోని అంకాలమ్మగూడూరులోని సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది ఇచ్చిన సర్వేలన్ని నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించకపోతే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కూటమికి నూకలు చెల్లినట్లే

పులివెందుల టౌన్ : ముస్లిం సమాజానికి చేటు చేసేలా కేంద్రంలోని మోడీ సర్కార్ తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు పలికిన టీడీపీ, జనసేన పార్టీలకు రాష్ట్రంలో నూకలు చెల్లినట్లేనని వైఎస్సార్‌సీపీ నూర్ బాషా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రసూల్ తెలిపారు. గురువారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లిం సమాజంలో వస్తున్న వ్యతిరేకతే దీనికి నిదర్శనమన్నారు. ఇప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీలు కూడా నమ్మే పరిస్థితి లేదన్నారు. త్వరలో వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని, అది మరో పాతికేళ్ల వరకు సుస్థిరంగా పాలన కొనసాగుతుందన్నారు. వక్ఫ్ బిల్లు చట్ట సవరణకు వ్యతిరేకంగా కోర్టుకెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకత్వం ముస్లిం సమాజంపట్ల తమకున్న చిత్తశుద్ధి ఏమిటో నిరూపించుకుందన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలతోపాటు మెజార్టీ జనమంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని ఆయన గుర్తుచేశారు.

పరామర్శ



ఓబయ్యను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని గొందిపల్లె గ్రామ పంచాయతీలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఓబయ్యను గురువారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. ఓబయ్య ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్నాడు.

నివాళి



నివాళులర్పిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేంపల్లె : వైఎస్సార్‌సీపీకి చెందిన మైనార్టీ నేత, వేంపల్లెకు చెందిన స్వర్ణకారుల సంఘం గౌరవ సభ్యుడు హాజీ బీఎస్ జాఫర్ సాబ్ గురువారం మృతి చెందాడు. కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి వారి ఇంటికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, మాజీ జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

విద్యుత్ కార్యాలయం తనిఖీ

వల్లూరు (చెన్నూరు) : జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు ఎస్.రమణ చెన్నూరు టౌన్‌లోని సబ్‌స్టేషన్లు, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించి తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లను యుద్ధ ప్రాతిపదికన సరిచేయాలని ఆదేశించారు. గురువారం కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేసి అనంతరం అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వేసవికాలం దృష్టిలో ఉంచుకుని అవసరమైన ప్రాంతాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ బిల్లులకు క్యూఆర్ కోడ్ ఉంటుందని, ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం ద్వా రా స్కాన్ చేసి చెల్లింపు చేయవచ్చని ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో కడప డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ఇంజనీర్ రామలింగారెడ్డి, జూనియర్ ఇంజనీర్ స్రవంతి పాల్గొన్నారు.

జూదరులు అరెస్ట్

వల్లూరు : మండలంలోని పైడికాలువ గ్రామ సమీపంలో గురువారం 12 మంది జూదరులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రూ 2,52,000 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు.

ముద్దనూరు : కొసినేపల్లెలో పేకాట ఆడుతున్న 6 మంది జూదరులను గురువారం అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ.10,150లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు.

హోమియో వైద్యం.. రోగులకు ఆనంద జీవితం



పక్క ఫొటోలో కనిపిస్తున్న అమ్మాయి పేరు బి.మౌనిక. కమలాపురం మండలం పెద్దచెప్పలి గ్రామం.. వెంకట సుబ్బారెడ్డి, ప్రమీల ప్రథమ పుత్రిక.. ఆ అమ్మాయి చిన్నప్పటి నుంచి మానసిక స్థితి సరిగా లేదు. సరిగా తిండి తినదు.. నిద్రపోదు..దీంతో ఆ అమ్మాయిని వారి తల్లిదండ్రులు కడప, తిరుపతి, హైద్రాబాద్, విజయవాడ, పుట్టపర్తి, బెంగళూరు తదతర ప్రాంతాలకు తీసుకెళ్లి వైద్యం అందించారు. అయినప్పటికి ఆమె పరిస్థితిలో మార్పు రాలేదు. 15 ఏళ్ల క్రితం కమలాపురం ప్రభుత్వ హోమియో వైద్యులు షాకీర్ హుసేన్ చేసిన హోమియో వైద్యంతో ఆమె మానసిక స్థితిలో కొంత మేరకు మార్పు వచ్చింది. కొంత కాలం తర్వాత హోమియో వైద్యులు బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఈ అమ్మాయికి మళ్లీ అదే పరిస్థితి ఎదురైంది. హోమియో వైద్యులు షాకీర్ హుసేన్ తిరిగి కమలాపురం ఆసుపత్రికి రావడం, గత ఆరు మాసాలుగా ఆ అమ్మాయికి హోమియో వైద్య సేవలు అందించడంతో మౌనిక పరిస్థితి చాలా మెరుగ్గా ఉందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ప్రభుత్వ హోమియో వైద్య శాలలో అందుబాటులో ఉన్న హోమియో మందులు

కమలాపురం : ఆరోగ్యం నేడు ఒక సమస్యగా మారింది. పుట్టకతోనే జబ్బులు. పిల్లాడు మొదలు పెద్దలు, వృద్ధుల వరకు ప్రతి ఒక్కరు ఏదో ఒక వ్యాధితో బాధ పడుతున్నారు. వేల రుపాయలు వెచ్చించి వైద్యం పొందినప్పటికి ఆరోగ్యం కుదుట పడని పరిస్థితి. అయితే పైసా ఖర్చు లేకుండానే వచ్చిన రోగాలను హోమియో వైద్యం ద్వారా పూర్తిగా నయం చేసుకోవచ్చని నిరూపిస్తున్నారు స్థానిక ప్రభుత్వ హోమియో వైద్యులు షాకీర్ హుసేన్. హోమియో వైద్యం ద్వారా ఆర్థిక ఇబ్బంది లేకుండా ఆరోగ్యం సొంతం చేసుకుంటున్నారు రోగులు. హోమియో వైద్యం సత్ఫలితాలు ఇస్తుండటంతో రోగులు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. దీంతో రోజు రోజుకు హోమియో వైద్యానికి రోగుల తాకిడి పెరుగుతోంది. గతంలో హోమియో వైద్యశాల ఉన్నప్పటికి డాక్టర్ లేక పోవడంతో నిరుపయోగంగా మారింది. 2012లో హోమియో వైద్యులు షాకీర్ హుసేన్ ఇక్కడికి వచ్చారు. హోమియో వైద్యం గురించి పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు ప్రతి చోట శిబిరాలు నిర్వహించి ప్రజలకు హోమియో వైద్యాన్ని పరిచయం చేశారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరు ఇంగ్లీష్ వైద్యం నుంచి హోమియో వైద్యం వైపుకు మరలుతున్నారు. రోజూ కనీసం 100 మంది రోగులు హోమియో వైద్యం పొందుతున్నారు. మండలం నుంచే కాక ఖాజీపేట, వల్లూరు, వీఎస్‌పల్లె, ఎర్రగుంట్ల తదితర మండలాల నుంచి రోగులు హోమియో వైద్యం కోసం కమలాపురంకు వస్తున్నారు. హోమియో వైద్యం ద్వారా ఆరోగ్యం బాగుందని చాలా మంది రోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పైసా ఖర్చు లేకుండా అన్ని రకాల దీర్ఘ కాలిక రోగాలకు సైతం చికిత్సలు పొందుతున్నారు.

మా పాప మానసిక స్థితి మెరుగైంది



మా పాప మౌనికకు చిన్నప్పటికి నుంచి మానసిక స్థితి సరిగా లేదు. దీంతో వైద్యం కోసం తిరుపతి, హైద్రాబాద్, విజయవాడ, బెంగళూరు తదితర ప్రాంతాలలో చికిత్స చేయించాను. అయినప్పటికి పరిస్థితిలో మార్పు లేదు. కమలాపురం హోమియో వైద్యులు షాకీర్ హుసేన్ ఇచ్చిన మందులతోనే తమ అమ్మాయి మౌనిక స్థితిలో మార్పు వచ్చింది. చాలా సంతోషంగా ఉంది.

-వెంకట సుబ్బారెడ్డి, పెద్దచెప్పలి, కమలాపురం మండలం

దీర్ఘకాలిక రోగాలకు సైతం చికిత్స



దీర్ఘకాలిక రోగాలకు సైతం హోమియోలో అద్భుత చికిత్సలున్నాయి. క్రమం తప్పకుండా హోమియో మందులు వాడితే మంచి ఫలితం ఉంటుంది. ముఖ్యంగా గ్యాస్ట్రబుల్, అలర్జీ, కిడ్నీ, మోకాళ్ల నొప్పులు, స్త్రీ వ్యాధులతో పాటు ప్రాణాంతక వ్యాధులైన చికెన్ గన్యా, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులకు హోమియోలో చికిత్సలున్నాయి. ప్రజలు హోమియో వైద్యంను వినియోగించుకోండి.

-షాకీర్ హుసేన్, ప్రభుత్వ హోమియో వైద్యులు, కమలాపురం

ప్రారంభమైన అంకాలమ్మ తిరునాల



ప్రత్యేక అలంకరణలో అంకాలమ్మ తల్లి అమ్మవారు

సింహాద్రిపురం : మండలంలో ఎంతో ప్రసిద్ధిగాంచిన అంకాలమ్మగూడూరు గ్రామంలో వెలసిన శ్రీ అంకాలమ్మతల్లి తిరునాల గురువారం వైభవంగా ప్రారంభమైంది. ఆలయ అర్చకులు అంకాలమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 20వ తేదీన రెండవ వారం ఆదివారం అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పాటు ఆనవాయితీ ప్రకారం కడపనాగయ్యపల్లె గ్రామస్తులు కుంకుమ బండిని మేళ తాళాలతో గుడి చుట్టూ ప్రదర్శనలు నిర్వహించి పసుపు కుంకమలను అందజేస్తారు. అలాగే ఈనెల 24వ తేదీన గురువారం అంకాలమ్మ అమ్మవారికి విశేష అలంకరణ ప్రత్యేక పూజలతోపాటు ఆనవాయితీ ప్రకారం బొజ్జాయిపల్లె గ్రామం నుంచి కుంకుమ బండితో ప్రదర్శన నిర్వహిస్తారు. అదే రోజు న్యూ కేటగిరి వృషభాలచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తారు. అలాగే గ్రామ యూత్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. ఈనెల 27వ తేదీ ఆదివారం అంకాలమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ తీర్థ ప్రసాదాలు అందజేసి రాత్రి 7.30గంటలకు అమ్మవారి కల్యాణం నిర్వహిస్తారు. దీంతో అంకాలమ్మ తిరునాల ముగియనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వాయిదా పడిన మండల సమావేశం



ఎంపీటీసీ సభ్యులతో చర్చిస్తున్న ఈవోపీఆర్డీ, కార్యాలయ ఏవో

ముద్దనూరు : మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలోని అధికారులు ఎంపీటీసీ సభ్యుల పట్ల వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు మూకుమ్మడిగా మండల మీట్‌ను బహిష్కరించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీ చాంబర్‌లో సమావేశమయ్యారు. ఎంపీడీవో కార్యాలయ పరిపాలనాధికారి పరిపూర్ణ అరుంధతి సమావేశానికి రావాలని సభ్యులను కోరారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ కార్యాలయం నుంచి సభ్యులకు ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదని, అభివృద్ధి పనులకు సంబంధించిన నిధుల మంజూరు, కేటాయింపులు, పనులు సభ్యులకు తెలియకుండానే చేపడుతున్నారని ఆమెతో వాదించారు. ఏ విషయంలోనూ సభ్యులకు అధికారులు సహకరించటంలేదని, నిర్లక్ష్యంగా, ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, కనీసం సభ్యులకు గౌరవ వేతనాలు కూడా అందలేదని అటువంటప్పుడు సమావేశానికి ఎందుకు హాజరుకావాలని ఆమెను నిలదీశారు. సమావేశానికి హాజరైన సమస్యలను తెలపాలని ఈవోపీఆర్డీ వీరభద్రుడు, పరిపాలనాధికారులు కోరినప్పటికీ సభ్యులు తిరస్కరించి మండల మీట్‌ను బహిష్కరించారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు ఇంద్రాణి, సరస్వతమ్మ, రేణుక, పుష్పలత, కళావతి, ఏసోబు, కో ఆప్షన్ సభ్యుడు ఖదీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

కమలాపురం : అగ్ని ప్రమాదాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జి ఎస్ఎఫ్ఓ జనార్ధన్ రెడ్డి తెలిపారు. ఈనెల 14వ తేదీ నుంచి జరుగుతున్న అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక సూర్య హైస్కూల్‌లో అగ్ని ప్రమాదాలు-వాటిని సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. స్కూల్స్‌లో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపు అగ్ని ప్రమాదం ఎక్కువ కాకుండా ప్రాథమిక దశలోనే అగ్నిని ఎలా అరికట్టాలో డెమో ద్వారా చేసి చూపించారు. వదరల్లో చిక్కుకున్న వ్యక్తులను లైఫ్ బాయ్, లైఫ్ జాకెట్ ద్వారా రక్షించే విధానంపై అవగాహన కల్పించారు. అలాగే పోర్టబుల్ అగ్ని మాపక యంత్రాలు, వాటి పనితీరుపై అవగాహన కల్పించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయడంలో తీవ్ర జాప్యం చేస్తోందని, ఎన్ని నిరసనలు తెలియజేసిన ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని సీఐటీయూ కార్యదర్శి దాసరి విజయ్, అధ్యక్షుడు ఏసుదాసులు తెలిపారు. గురువారం స్థానిక పాత బస్టాండ్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పారిశుద్ధ్య కార్మికులు నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మున్సిపల్ కార్మికులకు ఆప్కాస్ ద్వారా నియమించి వారికి ప్రభుత్వం ద్వారా జీతాలు ఇచ్చేదన్నారు. కానీ ప్రస్తుత ఎన్డీయే కూటమి ఆప్కాస్‌ను పక్కనపెట్టి కాంట్రాక్టర్ల ద్వారా జీతాలు ఇచ్చేప్రయత్నం చేస్తుందన్నారు. మున్సిపల్ కార్మికుల రిటైర్డు అయిన తర్వాత ప్రతి నెల వారికి పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ సెక్షన్‌లో పనిచేసే కార్మికులకు పనిముట్లు, యూనిఫాం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కార్యదర్శి శేఖర్, కార్మికులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

జమ్మలమడుగు : ఆర్టీసీ కార్మికులకు సంబంధించిన సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కారం చేయడంతోపాటు, ఆగిపోయిన పదోన్నతులను వెంటనే ఇవ్వాలని ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో గురువారం స్థానిక డిపో ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి శివుడు, రీజనల్ చైర్మన్ శేషన్నలు మాట్లాడుతూ గ్యారేజి ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను పరిష్కారం చేయాలని అనేక సార్లు యాజమాన్య దృష్టికి తీసుకుపోయిన ఇంతవరకు పరిష్కారం చేయలేదన్నారు. మహిళ ఉద్యోగులకు ప్రభుత్వ జీఓ ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వంఎలక్ట్రికల్ బస్సులను కొనుగోలు చేయాలనే ప్రతిపాదన పెట్టింది. అయితే దానికి సంబంధించిన శిక్షణ ఉద్యోగులకు ఇవ్వవలసి ఉందన్నారు. 114 జీవోలో పొందుపరచిన మేరకు నైట్ అవుట్ అలవెన్సు150 నుంచి 400 వరకు చెల్లింపులు చేయాలన్నారు.

వివాహ వేడుకల్లో ఎంపీ



గౌస్ పీరా కుటుంబ సభ్యులతో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఇన్‌చార్జి, జెడ్పీటీసీలు



పెళ్లి కుమారుడు హరికృష్ణ కుటుంబ సభ్యులతో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేముల : కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి గురువారం వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేల్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డి, మాజీ జెడ్పీటీసీ మరకా శివకృష్ణారెడ్డిలతో కలిసి వివాహ వేడుకలు జరుగుతున్న కుటుంబ సభ్యుల ఇళ్లకు వెళ్లారు. వైఎస్సార్‌సీపీకి చెందిన బీసీ నాయకులు వల్లెపు నాగేష్ కుమారుడు హరికృష్ణ వివాహం శుక్రవారం జరగనుంది. దీంతో ఆయన ముందుగా వారి ఇంటికి వెళ్లి పెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ షేక్ గౌస్ పీరా కుమార్తె వివాహం 20వ తేదీ ఆదివారం పులివెందులలో జరగనుంది. దీంతో ఆయన గౌస్ పీరా ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీతో కరచాలనం చేసేందుకు పాఠశాల విద్యార్థులు పోటీపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరి చేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

సమస్యలను పరిష్కరించండి

పెద్దముడియం : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ కె.కె.సుధ తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశంను నిర్వహించారు. సమావేశంలో అధికారులు గడచిన మూడు నెలల కాలంలో పనులకు అభివృద్ధి నివేదికలను చదివి వినిపించారు. గ్రామాల్లో ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించడం లేదని ఆర్టీసీ అధికారులను ప్రభుత్వ ఉద్యోగులు నిలదీశారు. ప్రతి పౌర్ణమికి జమ్మలమడుగు ఆర్టీసీ బస్టాండ్ నుండి తమిళనాడులోని అరుణాచలంకు బస్సు ఏర్పాటు చేశామని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆర్టీసీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో షంషాద్ బాను, ఏపీవో వెంకటసుబ్బయ్య, హౌసింగ్ ఏఈ సుబ్బరాయుడు, వెటర్నరీ డాక్టర్ భరత్‌కుమార్‌రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన

వేంపల్లె : వేంపల్లె మేజర్ గ్రామపంచాయతీ కింద 8 సచివాలయాలు పనిచేస్తున్నాయి. ఈ సచివాలయాల కింద దాదాపుగా 60 మంది సచివాలయ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇటీవల వేంపల్లె మేజర్ పంచాయతీ కార్యదర్శి ఎన్వీ సుబ్బారెడ్డి సస్పెన్షన్ కారణంగా సచివాలయ ఉద్యోగుల జీతభత్యాలు మార్చి నెలా చెల్లించలేదు. సస్పెన్షన్ నాటి నుంచి ఇప్పటివరకు ఎవరిని ఇన్‌చార్జిగా వేయకపోవడంతో ఏప్రిల్ నెల జీతాలు కూడా వస్తాయో, రావోననే సందిగ్ధంలో సచివాలయ ఉద్యోగులు ఉన్నారు. అనంతరం వారు ఎంపీడీఓ కుళ్లాయమ్మను కలిసి సమస్యలను విన్నవించుకున్నారు. తమ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి జీతాల చెల్లించేందుకు ఎవరినైనా ఇన్‌చార్జిగా వేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్ఎంయూ ఆందోళన

పులివెందుల రూరల్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎన్ఎంయూ నాయకులు గురువారం డిపో గేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జోనల్ కమిటీ మెంబర్ పీఎస్ఎస్ రావు, డిపో చైర్మన్ ఆర్.ఆర్.ఎల్ రెడ్డి, డిపో అధ్యక్షుడు జేవి రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎం.రెడ్డిల ఆధ్వర్యంలో సుమారు 40 మంది ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. సమస్యలు పరిష్కరించకపోతే సెంట్రల్ కమిటీ పిలుపు ఆదేశాల మేరకు భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు.


బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ

సింహాద్రిపురం : మండల నూతన ఎస్ఐగా జె.రవి కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. బద్వేలు పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ బదిలీపై సింహాద్రిపురం ఎస్ఐగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు.

అధికారులు లేక వెలవెలబోతున్న కార్యాలయాలు



పీబీసీ ఈఈ లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీ



జీఎన్ఎస్ఎస్ కార్యాలయంలో కనిపించని అధికారులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని అంబకపల్లె రోడ్డు సమీపంలోని మినీ సెక్రటేరియట్ కార్యాలయంలో పీబీసీ, జీఎన్ఎస్ఎస్ కార్యాలయాలు ఉన్నాయి. పులివెందుల బ్రాంచ్ కెనాల్ ఈఈగా పని చేస్తున్న రాజశేఖర్ పదవి విరమణ పొంది 17 రోజులవుతున్నప్పటికీ సంబంధిత అధికారిని కార్యాలయంలో నియమించలేదు. అలాగే పీబీసీ ఈఈని ఉన్నతాధికారులు నియమించాల్సి ఉంది. పీబీసీ కార్యాలయంలో ఈఈ స్థాయి అధికారి లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కార్యాలయానికి సంబంధించి, బిల్లులు ఇతర ఉత్తర ప్రత్యుత్తరాలు, ప్రజా సమస్యలు పరిష్కారంకాక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పీబీసీ కెనాల్ నుంచి తాగునీటిని విడుదల చేస్తున్నారు కానీ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేదు. కార్యాలయంలో ఏఈల కొరత కూడా ఉంది. పీబీసీ ఈఈ అధికారి లేకపోవడంతో నీటి పరిరక్షణ ఇబ్బందిగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారులను నియమించకపోవడం గమనార్హం.

డ్వాక్రా యానిమేటర్లపై రాజకీయ కక్ష

పెండ్లిమర్రి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో ఉన్న చిన్న, చిన్న పోస్టులపై రాజకీయ కక్ష సాధింపు చేపట్టారు. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్న వారిని ఎలాంటి తప్పులు చేయకున్నా విధుల నుంచి తొలగిపోవాలని అధికారుల ద్వారా ఒత్తిడి తెస్తున్నారు. పెండ్లిమర్రి మండలంలో ఇప్పటికే కొన్ని చోట్ల రేషన్ డీలర్ల, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌లను తొలగించారు. కొందరితో బలవతం రాజీనామా చేయించారు. రాజకీయాలు అంటే తెలియని డ్వాక్రా యానిమేటర్లపై కక్ష సాధింపు చేస్తూ వారిని విధుల నుంచి తొలగిపోవాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. మండలంలోని చీమలపెంట, గంగనపల్లె యానిమేటర్ల గ్రామాల్లో విధులు సక్రమంగా నిర్వహిస్తున్నా కూడా కూటమి నాయకుల ఆదేశాల మేరకు వారు విధుల నుంచి తప్పుకొవాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. గురువారం చీమలపెంట, గంగనపల్లె యానిమేటర్ల పెండ్లిమర్రి వెలుగు కార్యాలయానికి వెళ్లి మమ్మలను ఎందుకు తొలగిస్తున్నారని అడగ్గా ఏపీఎం రాజకీయ ఒత్తిడిలు ఉన్నాయని చెబుతున్నారు. ఈ విషయంపై ఏపీఎం బాలస్వామిని వివరణ కోరగా చీమలపెంట, గంగనపల్లె యానిమేటర్ల పనితీరు సరిగా లేదని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు గ్రామంలో విచారణ చేపట్టి వారి పనితీరు సక్రమంగా లేదని మండల సమాఖ్య మీటింగ్‌లో తీర్మాణంచేసి వేరే వారిని ఎంపిక చేశాము. కార్యాలయంపై దాడికి రావడంతో వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

తొండూరు : వేసవిలో వడదెబ్బకు గురికాకుండా మండల ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తొండూరు పీహెచ్‌సీ డాక్టర్ ఆరిఫుల్లా గురువారం అవగాహన కల్పించారు. మధ్యాహ్న సమయంలో విద్యార్థులు బయటకు వెళ్లకుండా ఇళ్లలోపలే ఉండి హోం వర్క్ చేసుకోవడం, చదువుకోవడం లేదా నిద్రపోవడం చేయాలన్నారు. ఎండలో క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీ బాల్ వంటి ఆటలు ఆడటం వల్ల వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. వడదెబ్బకు గురైన వారికి ఎక్కువగా జ్వరం, తలనొప్పి, నీరసం, కళ్లు తిరగడం, విరేచనాలు, వాంతులు, నోరు ఆరిపోవడం, అపస్మారక స్థితిలోకి వెళ్లడం, కలవరింతలు వంటి లక్షణాలు ఉంటాయన్నారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే చల్లటి నీడ ప్రదేశంలోకి తీసుకెళ్లాలని, మెలకువలో ఉంటే ఉప్పు కలిసిన మజ్జిగ గానీ, ఓఆర్ఎస్ ద్రావణం గానీ తాగించాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు తీసుకొని వెళ్లాలన్నారు. గంట గంటకు ఒక గ్లాస్ నీరు తాగాలని, ఇంటిలో కిటికీలు తెరిచి ఉంచాలని, నల్లని బట్టలు వేయరాదని, కద్దరు బట్టలు వదులుగా ఉన్నవి వేసుకోవాలని సూచించారు. దూర ప్రయాణాలు చేయరాదని, గర్భిణులు, బాలింతలు, 10 ఏళ్లలోపు పిల్లలు, 60 ఏళ్లపైబడిన వారు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు.

నేడు ఆలయ ప్రథమ వార్షికోత్సవం

వీరపునాయునిపల్లె : ఈనెల 18వ తేదీన మండలంలోని సంగాలపల్లె, సర్వరాజుపేట గ్రామాల సమీపంలో వెలసిన మునీశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పూర్వం నుంచి ఈ ప్రాంతంలో పుట్ట ఉండేదని పుట్ట పక్కన బండలతో గుడిని నిర్మించి ఈశ్వరుడి పటం పెట్టి పూజలు నిర్వహించేవారు. గంగిరెడ్డిపల్లెకు చెందిన మహబూబ్‌బాషాకు కళలో శివుడు కనిపించి శివలింగాన్ని ప్రతిష్టించాలని తెలపడంతో గత ఏడాది శివలింగాన్ని ప్రతిష్ట కార్యక్రమం చేపట్టారు. నేటికి సంవత్సరం పూర్తి కావడంతో దాతల సహకారంతో వార్షికోత్సవం నిర్వహించనున్నారు. కోలాట కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వార్షికోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని అలాగే పరమశివుడి కృపకు పాత్రులు కాగలరని నిర్వాహులు కోరారు.

ఎమ్మెల్సీకి ఫిర్యాదు



ఎమ్మెల్సీకి ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

జమ్మలమడుగు : పెద్దముడియం మండలంలోని సేల్ సోలార్ కంపెనీ యాజమాన్యం గ్రామంలో పశువుల మేతకు సంబంధించిన కొండను పూర్తిగా చదును చేస్తున్నారని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డికి రైతులు ఫిర్యాదు చేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో కొండకల్వటాల, కొండపాపాయపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో ప్రభుత్వం ఇచ్చిన అసైన్డు భూముల్లో పట్టాదారుల అనుమతులులేకుండా పనులు చేయడంతోపాటు, గ్రామానికి చెందిన రైతుల భూమిని ఒక్కొక్కరికి ఒక్కో రేటు కట్టి అన్యాయం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ వారి తరపున పోరాటం చేయటానికి సిద్ధంగా ఉన్నామన్నారు.